# ఈలా ఆదేశాలు

**128వ అంశం : నాలుగు మాసాల వరకూ భార్యకు మందలింపుగా ఆమెతో లైంగిక సంబంధాన్ని త్రెంచుకునేందుకు అనుమతి ఉంది. దీనినే షరీయతులో 'ఈలా' అంటారు.**

**129వ అంశం : 'ఈలా' గరిష్ట గడువు (నాల్గు మాసాలు) గడిచాక భర్త తన ఈలాను ఉపసంహరించుకోవాలి లేదా విడాకులు ఇవ్వాలి.**

"ఎవరయితే తమ భార్యలతో సంబంధం పెట్టుకోబోమని ఒట్టేసుకుంటారో వారి కొరకు నాలుగు మాసాల గడువు ఉంది. మరి వారు గనక (ఈ లోగా) మరలివస్తే అల్లాహ్ కూడా క్షమించేవాడు, జాలి చూపేవాడు. ఒకవేళ వారు విడాకులు ఇవ్వాలనే నిశ్చయించుకుంటే, నిస్సందేహంగా అల్లాహ్ అన్నీ వినేవాడు, అంతా తెలిసినవాడు." (అల్ బఖర- 226,227)

వివరణ: ఏదేని పరమార్థంతోనో, అవసరం మేరకో పరస్పర అంగీకారంతో భర్త తన భార్యతో నాలుగు మాసాలకన్నా ఎక్కువకాలం కూడా వేరుగా ఉండటం సమ్మతమే, సరైనదే.

**130వ అంశం : వేధించే ఉద్దేశంతో 'ఈలా' చేయుటం తగదు**

హజ్రత్ అబూ సర్మా(రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ఎవడయినా వేరొకరికి కీడు కలిగిస్తే అల్లాహ్ అతనికి కీడు కలిగిస్తాడు. ఎవడయినా వేరొకరిని ఇబ్బంది పెడితే అల్లాహ్ అతన్ని ఇబ్బందికి గురిచేస్తాడు."

(ఇబ్నుమాజ-2342. ఈ హదీసు హసన్ కోవకు చెందినది.)[1]

**131వ అంశం : 'ఈలా' గరిష్ట గడువు (4 మాసాలు) ముగిసిన మీదట కూడా భర్త భార్యతో లైంగిక సంబంధం ఏర్పరచుకోకపోతే, ఆమెకు విడాకులు కూడా ఇవ్వకపోతే ఆ స్త్రీ షరీయత్ కోర్టును ఆశ్రయించగలదు. కోర్టు జోక్యం చేసుకుని ఆమెను తిరిగి రప్పించుకోవటమో లేదా విడాకులివ్వటమో చేయమని ఆ మగవాణ్ణి శాసిస్తుంది.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కథనం: "ఈలా గడువు- నాలుగు మాసాలు- ముగిసిన తరువాత భార్యకు విడాకులిచ్చేలా భర్తపై ఒత్తిడి తీసుకురావటం జరుగుతుంది." దీనిని బుఖారీ పొందుపరిచారు.[2]

---

*1. సహీహ్ సుననె ఇబ్నుమాజ, లిల్ అల్బానీ- రెండవ భాగం, హ.నెం.1897*

*2. కితాబుత్తలాఖ్- ఖౌలుల్లాహు తాలా లిల్లజీన యూలూన మిన్ నిసాయిహిమ్*

teluguislam.net



వివరణ : 'ఈలా' కారణంగా భర్త గనక భార్యకు విడాకులిస్తే సాధారణ విడాకులకు ఉండే ఇద్దతే (గడువే) ఈ విడాకులకూ ఉంటుంది.

## 132వ అంశం : ఒకవేళ భర్త ప్రమాణ గడువు ముగియక ముందే 'ఈలా' నుండి మరలివస్తే, అతను తన ప్రమాణ భంగానికి గాను పరిహారం చెల్లించాలి.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా ఉపదేశించారు: "ఎవరయినా ఏదైనా విషయం గురించి ఒట్టేసుకుని, ఆనక మరో విషయాన్ని దీనికన్నా మేలైనదిగా భావిస్తే తన ప్రమాణ భంగానికిగాను పరిహారం (కఫ్ఫారా) ఇచ్చి, మేలైన దానినే అనుసరించాలి." దీనిని ముస్లిం పొందుపరిచారు.[1]

వివరణ: ప్రమాణ భంగం జరిగినందుకు పరిహారంగా పదిమంది నిరుపేదలకు అన్నం పెట్టాలి లేదా బట్టలు పెట్టాలి లేదా ఒక బానిసకు బానిసత్వం నుండి స్వేచ్ఛను ొసగాలి. ఒకవేళ వీటిలో ఏ ఒక్కటీ చేయలేకపోతే మూడు రోజులపాటు ఉపవాసం పాటించాలి. (వివరాలకు అల్ మాయిద సూరా 89వ ఆయత్ చూడండి)

## 133వ అంశం : మహనీయ ముహమ్మద్ (స) ఒక నెలకాలం పాటు 'ఈలా' పాటించారు

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి)కథనం: మహాప్రవక్త ముహమ్మద్ (స) తమ సతీమణుల నుంచి వేరై 'ఈలా' పాటించిన సమయంలో ఆయన(స) కాలు బెణికి ఉంది. ఆయన(స) 29 రోజుల వరకూ ఇంటిలోని మంచెపైన గడిపారు. 29 రోజుల తరువాత ఆయన(స) దిగివచ్చినప్పుడు జనులు, 'ప్రవక్త (స) ఒక నెలరోజులని ప్రమాణం చేశారు కదా!' అని చెప్పుకోసాగారు. దానికి ఆయన(స) "29 రోజుల నెల కూడా ఉంటుంది కదా!" అని స్పందించారు. ఈ హదీసును బుఖారీ పొందుపరిచారు.[2]

---

1. *కితాబుల్ అయిమాన్*
2. *కితాబుత్తలాఖ్: బాబు ఖౌలుల్లాహి త ఆలా*